సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



కొనుగోళ్లలో తిరకాసు

ఎకరానికి సోయా ఆరున్నర క్వింటాళ్లే సేకరించాలని మార్క్‌ఫెడ్ తిరకాసు పెట్టింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



వైభవంగా రథోత్సవం

డిచ్‌పల్లిలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎంపీడీవో కార్యాలయానికి తాళం




వర్ని: అద్దె చెల్లించలేదని చందూరు ఎంపీడీవో కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గత 26 నెలలుగా భవనానికి అద్దె చెల్లించడం లేని ఇంటి యజమాని సూర్యనారాయణ తెలిపారు. నెలకు రూ. 6358 చొప్పున మొత్తం రూ. 1,65,308 చెల్లించే వరకు కార్యాలయానికి తాళం తీయనని భీష్మించుకు కూర్చున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్యాలయానికి తాళం తీశారు.

ఎస్సారెస్పీ మూడు గేట్లు ఎత్తివేత



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి గురువారం ఉదయం నుంచి వరద నీరు పెరగడంతో మూడు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 9372 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 18823 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 873 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులతో నిండుకుండలా ఉంది. కాగా ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటిని వదల కుండా గోదావరిలోకి విడుదల చేయటంపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్త ం చేస్తున్నారు.

నిజాంసాగర్‌లోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో ఒక వరద గేటు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీ లు) కాగా 1,404.98 అడుగుల(17.8టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కులగణనకు సిద్ధం



జిల్లాలో త్వరలోనే కులగణన ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం పూర్తయింది. కుల గణన నివేదిక ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల స్థానాలు ఖరారు కానున్నాయి. అదేవిధంగా కులగణన సర్వేతో కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై కూడా అంచనాకు రావొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 10 కుటుంబాల సర్వే

- 60 రోజులపాటు కొనసాగనున్న ప్రక్రియ
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్ వినియోగం
- నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు

సుభాష్‌నగర్ : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీల కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. కుల గణనపై తాజాగా మార్గదర్శకాలు విడుదలయ్యాయి. 60 రోజులపాటు కొనసాగే ప్రక్రియలో ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 10 కుటుంబాల చొప్పున సర్వే చేపట్టనున్నారు. కుల గణనకు ఇప్పటికే ప్రత్యేక యాప్ రూపొందించినట్లు సమాచారం. కుల గణన పూర్తయిన తర్వాత నివేదిక ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. సర్వేతో కుల గణనతోపాటు ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై కూడా అంచనాకు రావొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఎన్యుమరేటర్ల నియామకం..

ఇంటింటికి సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్ల నియామకం పూర్తయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మార్గదర్శకాల ప్రకారం సిబ్బంది డాటా సేకరించినట్లు సమాచారం. మొత్తం 3,398 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేపట్టనున్నారు. ఎన్యుమరేటర్లుగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈవోలను నియమించారు. సర్వే పర్యవేక్షణ కోసం సూపర్ వైజర్లుగా 340 మంది మండల స్థాయి అధికారులను నియమించారు.

మండలాలు	గ్రామపంచాయతీలు	మొత్తం ఇండ్లు (అంచనా)	ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు
27	545	4,63,398	3,398	340

ఎన్యుమరేటర్లకు శిక్షణ..

సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి కావడంతో రెండ్రోజుల్లో వారికి యాప్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. సర్వే చేపట్టే సమయంలో కుటుంబాలను అడగాల్సిన ప్రశ్నావళి, యాప్‌లో నమోదు చేసే విషయాలపై అవగాహన కల్పించనున్నారు.బీసీ కులగణనతోపాటు ఎస్సీ, ఎస్టీల కులగణనను ప్రభుత్వం చేపడుతోంది. ఇందుకోసం ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి సర్వే కోసం వెళ్లనున్నారు. సర్వే పూర్తయి రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వచ్చిన తర్వాతే గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందడుగు పడుతుందనేది ఇప్పటికే స్పష్టమైంది. జీపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రభుత్వం సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వే చేపట్టనుంది.

త్వరలో ప్రారంభం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో త్వరలోనే కులగణన ప్రక్రియ మొదలుపెడతాం. ఇప్పటికే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం కోసం ఉద్యోగులు, సిబ్బంది వివరాలు సేకరించాం. రెండు, మూడు రోజుల్లో ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పిస్తాం. మార్గదర్శకాల ప్రకారం సర్వే విజయవంతమయ్యేలా జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ముందుకెళ్తాం. – ముస్త్యాల శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

వాడినవే మళ్లీ పరీక్షలకు..



జీజీహెచ్‌లో వాడిన యూరిన్ కంటైనర్లు



యూరిన్ కంటైనర్లను పరిశీలిస్తున్న రోగుల బంధువులు

- జీజీహెచ్‌లో పాత యూరిన్ కంటైనర్లు వినియోగిస్తున్న వైనం
- దుర్వాసన వస్తున్నాయని రోగుల ఆవేదన.. ఫలితాలపైనా అనుమానాలు !

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూత్ర పరీక్షలకు యూరిన్ కంటైనర్స్ (డబ్బాలు) ఒకసారి వాడిన వాటినే మళ్లీ వినియోగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగులకు పాత డబ్బాలనే యూరిన్ పరీక్షలకు ఇస్తున్నారు. అవి భరించలేని దుర్వాసన వస్తున్నాయని ప్రశ్నిస్తే.. కొత్తవి లేవని, వీటితోనే పరీక్షలు చేస్తామని సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం జీజీహెచ్‌లోని 7వ అంతస్తులోని ల్యాబ్‌లో పాత డబ్బాలు చూసి రోగులు సిబ్బందిని నిలదీశారు. మూత్ర పరీక్షల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేశారు.

జీజీహెచ్‌కు గత కొన్ని నెలలుగా రోగుల తాకిడి పెరిగింది. వైద్యులు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని రోగులకు సూచిస్తున్నారు. రోగుల తాకిడి పెరుగుతున్న విషయాన్ని ఆస్పత్రి అధికారులు ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. ఇటీవల జీజీహెచ్ తనిఖీ చేయడానికి వచ్చిన కమిషనర్ అజయ్‌కుమార్ దృష్టికి సైతం ఆస్పత్రిలో మరిన్ని సదుపాయాలు కావాలని సూపరిన్ టెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ విన్నవించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో రోగుల మూత్ర పరీక్షలకు ఉపయోగించే కంటైనర్స్ సరిపడా లేవు. కొన్ని రోజులుగా పాత యూరిన్ కంటైనర్స్‌ను కడిగి మళ్లీ ఉపయోగించుకోవాలని పై అధికారులు చెప్పారని పరీక్షలు నిర్వహించే సిబ్బంది చెబుతున్నారు. ఈ పాత డబ్బాలపై గతంలో పరీక్షలు నిర్వహించిన వారి పేర్లు, ఐపీ నంబర్లు అలాగే ఉన్నాయి.

ఆ కంటైనర్స్ చూస్తే భయమేస్తోంది



అనారోగ్యంగా ఉండడంతో వైద్యులకు చూపించాను. వైద్యుల సలహా మేరకు మూత్ర పరీక్షలు చేయించుకోవాలని చెప్పడంతో 7వ అంతస్తులో ఉన్న ల్యాబ్‌కు వచ్చాను. ఇక్కడ మూత్ర పరీక్షలు చేసే సిబ్బంది పాత డబ్బాల్లోనే యూరిన్ తీసుకవచ్చి అక్కడ పెట్టాలని చెబుతున్నారు. వాటిని చూస్తేనే భయం వేస్తుంది. ఎలా పరీక్షలు చేస్తారో ఏమో తెలియడం లేదు. - శ్రీనివాస్‌రెడ్డి

దుర్వాసన వస్తోంది



మూత్ర పరీక్షలకు ఉపయోగించే యూరిన్ కంటైనర్స్ ఆధ్వానంగా, అపరిశ్రుభంగా ఉన్నాయి. యూరిన్ పరీక్షలకు కొత్తవి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే స్టాక్ లేదని, గత కొన్ని రోజులుగా పాత డబ్బాలనే ఇస్తున్నామని చెబుతున్నారు. ఈ డబ్బాలు కడగడం లేదు. భరించలేని దుర్వాసన వస్తోంది. - ఆకాష్

అధికారులు పర్యవేక్షణ చేయాలి



ఏ ఆస్పత్రిలో అయినా మూత్ర పరీక్షలకు కొత్త యూరిన్ కంటైనర్స్ ఇస్తారు. ఇక్కడ మాత్రం పాత డబ్బాలను ఇస్తున్నారు. అధికారులేమో స్టాక్ ఉందని చెబుతారు. ఇక్కడ సిబ్బంది మాత్రం సరిపడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఇందులో ఎవరి మాటాలు నమ్మాలో తెలియడం లేదు. పెద్దాస్పత్రిలో ఇలాంటి పరిస్థితి లేకుండా అధికారులు చూసుకోవాలి. - నాబియా బేగం

మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి జయంతిలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

నిజామాబాద్‌అర్బన్: ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షత వహించగా, నగర మేయర్ నీతూకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కులమతాలకు చెందిన సంప్రదాయాలు, పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. మహోన్నతమైన రామాయణ గ్రంథాన్ని అందించిన మహాకవి వాల్మీకిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్, నర్సయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరేష్, బీసీ సంఘాల నాయకులు బుస్సా ఆంజనేయులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన వైజాగ్, పాడేరు, అరకు తదితర ఏరియాల నుంచి నిజామాబాద్ మీదుగా గంజాయిని మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద నిశిత పరిశీలన చేయాలన్నారు. గంజాయి విక్రేతలను, వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను వెలికితీయాలని, ఈ దిశగా, పోలీస్, ఎక్సైజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని డీ–అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో గంజాయి కేసులు కొంతవరకు తగ్గాయని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఎక్సయిజ్ శాఖ సమన్వయంతో మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, డీఐఈవో రవికుమార్, అటవీ, రవాణా, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొలి పాఠం.. ఎంతో ఆనందం

- మా జీవితాల్లో మరుపురాని రోజు
- విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాం
- కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుల మనోగతం



గుమ్మిర్యాల్ ప్రాథమిక పాఠశాలలో విద్యబోధన చేస్తున్న శ్రీజ

కొత్తగా విధుల్లో చేరి విద్యార్థులకు పాఠాలు చెప్పటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, తొలి రోజు విద్యాబోధన తమ జీవితాల్లో మరుపురానిదని డీఎస్సీలో నియామకమైన ఉపాధ్యాయులు మనోభావాలను పంచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 453 మంది టీచర్లు అందుబాటులోకి వచ్చారు. మంగళవారం వీరికి పోస్టింగులు కేటాయించగా బుధవారం పాఠశాలల్లో రిపోర్టు చేశారు. గురువారం పాఠశాలల్లో విద్య బోధన ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తామని అన్నారు. – నిజామాబాద్‌అర్బన్

సీనియర్ టీచర్ల నుంచి నేర్చుకున్నాను



తొలి రోజు పాఠశాలలో సీనియర్ టీచర్ల నుంచి అనేక విషయాలు తెలుసుకున్నాను. విద్య బోధనపై వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. తొలిరోజు పాఠశాలలో విద్యార్థులకు బోధన చేపట్టడం మరుపురాని రోజు. విద్యార్థులు కూడా చక్కగా పాఠం విన్నారు. గణితంలో టేబుల్స్ వేసి వివరించాను. తెలుగు కూడా చెప్పాను.

– డి శ్రీజ, ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాల గుమ్మిర్యాల్, ఎర్గట్ల మండలం

విద్యార్థులు తెలివిగా ఉన్నారు



తొలి రోజు విద్యార్థుల మనోభావాలను తెలుసుకున్నాను. వారి సామర్థ్యాలను తెలుసుకుని వారికి ఎలా బోధించాలో గమనించాను. విద్యార్థులు చాలా తెలివిగా ఉన్నారు. నా తొలి బోధన నాకు మర్చి పోలేని రోజు.

– పుట్ట అనుదీప్, ఎస్జీటీ, రాంసింగ్ తండా ప్రాథమిక పాఠశాల, భీమ్‌గల్ మండలం

ప్రభుత్వ పాఠశాలలో మంచి సౌకర్యాలు..



ప్రభుత్వ పాఠశాలలో మంచి సౌకర్యాలు ఉన్నాయి. తల్లిదండ్రులు విద్యా బోధనను, సౌకర్యాలను గమనించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. తొలిరోజు మూడు సబ్జెక్టులు బోధించాను. ఎంతో ఆనందంగా ఉంది. ఇక్కడి వాతావరణం బాగా నచ్చింది. మరింత మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తాను, నా తొలిరోజు విద్య బోధన ఎంతో సంతోషంగా ఉంది.

– ఆకాష్, ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాల బినోల, నవీపేట మండలం

బంగారు బాట వేస్తాను

తొలిరోజు విద్యార్థులను చూడగానే సంతోషం అనిపించింది. విద్యార్థులకు మంచి బోధన చేస్తాను. వారి బంగారు భవిష్యత్తుకు బాట వేస్తాను. – రమ్యశ్రీ, ఎస్జీటీ, తాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల, భీమ్‌గల్ మండలం



తాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు బోధిస్తున్న ఎస్జీటీ రమ్యశ్రీ

విద్యార్థులను తీర్చిదిద్దుతా..



తొలి రోజు పాఠాలు బోధించడం, పాఠశాల వాతావరణం ఎంతో బాగుంది. ఉద్యోగం రాగానే తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించడం మర్చిపోలేని రోజు. రెండు సబ్జెక్టులు చెప్పాను. ప్రాణాళిక బద్ధంగా విద్యార్థులను అన్ని సబ్జెక్టులలో తీర్చిదిద్దుతాను.

– కీర్తి, ఎస్జీటీ, హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాల, సిరికొండ మండలం.

గణితం చెప్పాను



తొలిరోజు పాఠాలు బోధించడం చాలా ఆనందంగా ఉంది. విద్యార్థులకు గణితం చక్కగా అర్థం అయ్యేలా వివరించాను. ప్రతి క్లాస్‌లో ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలన్నది నా లక్ష్యం. ఉద్యోగం వచ్చిన దానికంటే తొలిరోజు పాఠం బోధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– మనోహర్, స్కూల్ అసిస్టెంట్, ఖానాపూర్ ఉన్నత పాఠశాల, నిజామాబాద్‌రూరల్ మండలం

కానిస్టేబుల్ నుంచి పాఠశాలకు..



నేను ఇంతకుముందు కానిస్టేబుల్ గా పని చేశాను. తొలిరోజు పాఠశాలకు వెళ్లి పాఠాలు బోధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితం చెప్పాను. చక్కగా విన్నారు. గతంలో చేసిన పనికి, పాఠశాల బోధన చాలా తేడా ఉంది. విద్య బోధన చేపట్టడం ఆనందంగా అనిపించింది.

– మహేశ్, స్కూల్ అసిస్టెంట్, ఫకీరాబాద్ ఉన్నత పాఠశాల, నవీపేట మండలం

కష్టపడినందుకు ఫలితం..



నేను గతంలో గురుకుల పాఠశాలలో పార్ట్ టైం గా పని చేశాను. టీచర్ అయ్యేందుకు చాలా కష్టపడ్డాను. మొదటి రోజు పాఠశాలలో 7, 8 తరగతుల పిల్లలకు పాఠాలు బోధించడం ఎంతో సంతోషంగా ఉంది. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో పాఠాలు విన్నారు. విద్యార్థులను మరింత ఉన్నతులుగా తీర్చిదిద్దుతాను.

– జయలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్, ఫకీరాబాద్ ఉన్నత పాఠశాల, నవీపేట మండలం

మధురానుభూతి



విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకువెళ్లడమే ప్రధాన లక్ష్యం. వారికి అనుకూలంగా విద్య బోధన చేపట్టి విద్యావంతులుగా తీర్చిదిద్దుతాను. వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాను. నా విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండాలన్నదే నా లక్ష్యం. తొలిరోజు చేపట్టిన విద్య బోధన ఎంతో మధురం. – సరోజ, స్కూల్ అసిస్టెంట్, అంబెం ఉన్నత పాఠశాల, ఎడపల్లి మండలం

పిల్లల పుస్తకాల్లో సంతకాలు చేశాను



తొలి రోజు విద్యార్థుల నోట్ బుక్కులను పరిశీలించి అసైన్మెంట్ ఇచ్చాను. ప్రతి విద్యార్థి నోట్ బుక్కులో సంతకం చేస్తూ హోంవర్క్ ఇవ్వడం చాలా ఆనందం అనిపించింది. బాధ్యతతో విద్యార్థుల అభివృద్ధికి పాటు పడతాను. జీవితంలో మర్చిపోలేని రోజు. – మానస, ఎస్జీటీ, నాళేశ్వర్ ప్రాథమిక పాఠశాల, నవీపేట మండలం

సోయా కొనుగోళ్లలో తిరకాసు

- ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లే కొనుగోలు
- దిగుబడితో సంబంధం లేదు
- క్రాప్‌ బుకింగ్‌ ఆధారంగా అనుమతి
- వ్యాపారులను రైతులు ఆశ్రయించక తప్పని పరిస్థితి
- రైతులకు నష్టమంటున్న నాయకులు


తాళ్లరాంపూర్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి

మోర్తాడ్‌(బాల్కొండ): సోయా కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్‌ తిరకాసు పెట్టింది. దిగుబడి ఎంత వచ్చినా ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల సోయాను మాత్రమే సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడిని పరిగణనలోకి తీసుకోకుండా కొనుగోళ్లపై పరిమితులు విధించడం రైతులకు మింగుడు పడటం లేదు. ఐడీసీఎంఎస్‌ ద్వారా మార్క్‌ఫెడ్‌ జిల్లాలో 12 సోయా కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోంది. క్వింటాల్‌కు రూ.4,892 మద్దతు ధర చెల్లిస్తూ ఇప్పటి వరకు నాలుగువేల క్వింటాళ్లను సేకరించారు. ఇదిలా ఉండగా బయటి మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.4,400 చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు, వ్యాపారులు చెల్లించే ధరకు ఎంతో తేడా ఉండటంతో సోయా విక్రయించాలా? నిల్వ చేయాలా? అనే ఆలోచనలో రైతులు ఉన్నారు. ఒక ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఆ లెక్కలతో సంబంధం లేకుండా ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల సోయాను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన సోయాను రైతులు వ్యాపారులకే విక్రయించాల్సి వస్తోంది. గడిచిన యాసంగిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్రాప్‌ బుకింగ్‌ చేయగా.. ఆ లెక్కల ఆధారంగానే కొనుగోలు కేంద్రాల్లో సోయాను సేకరిస్తున్నారు. ఒక వేళ సోయా సాగు చేసినట్లు క్రాప్‌ బుకింగ్‌లో నమోదు కానిపక్షంలో కొనుగోలు కేంద్రాల్లో సోయా తూకం వేసే పరిస్థితి లేదు. జిల్లాలో దాదాపు 60వేల ఎకరాల్లో సోయా సాగు చేశారు. ఈసారి దిగుబడి గణనీయంగా ఉన్నా కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తిరకాసు పెట్టడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. పరిమితి నిబంధన ఎత్తివేయాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తున్నాం

సోయా కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిబంధనలను అమలు చేస్తున్నాం. ఒక ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల సోయానే కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. మార్గదర్శకాలను సవరిస్తే ఎక్కువ సోయా గింజలను కొనుగోలు చేస్తాం. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఒక్కో ఎకరానికి పరిమితంగానే సోయాను సేకరిస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్‌ జిల్లా మేనేజర్‌

పరిమితిని ఎత్తివేయాలి



సోయా కొనుగోళ్ల విషయంలో ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేయాలి. దిగుబడి ఆశించినదాని కంటే ఎక్కువ లభించింది. సోయాను విక్రయించడంలో రైతులు దళారులను ఆశ్రయించే పరిస్థితి తీసుకురావొద్దు.

– దడివె మోహన్‌, రైతు, మోర్తాడ్‌

కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలి



సోయా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలి. మార్కెట్‌లో ఉన్న ధర కంటే కొనుగోలు కేంద్రాల్లోనే సోయాకు ఎక్కువ ధర లభిస్తోంది. సోయా కొనుగోలు నిబంధనలను సవరించి రైతులకు మేలు చేయాలి.

– కౌడ లింబాద్రి, రైతు, తొర్తి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం

వర్ని: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని హుమ్నాపూర్‌లో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజుతో కలిసి గురువారం పోచారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్ని ప్రాంతంలో వరి కోతలు ముందుగా ప్రారంభమవుతాయని, మొదట్లో గిట్టుబాటు ధర చెల్లించే ధాన్యం వ్యాపారులు రానురాను ధర తగ్గిస్తూ సొమ్ము చేసుకుంటారని గిట్టుబాటు ధర రాని రైతులు దళారులకు, వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని అన్నారు. దిగుబడి పెద్ద మొత్తంలో వచ్చిన తరువాత వ్యాపారులు ధర తగ్గించడం మామూలు విషయం మారిందన్నారు. హుమ్నాపూర్‌ నుంచి అఫందిఫారం వరకు మెటల్‌ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. వర్ని మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేశ్‌ బాబా, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌, సొసైటీ చైర్మన్‌ కనక రాజు, వర్ని సొసైటీ మాజీ అధ్యక్షులు వీర్రాజు, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజిరెడ్డి, వర్ని మాజీ జెడ్పీటీసీ రణజానాయక్‌ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని టీఎస్‌ఎస్‌పీ ఏడో బెటాలియన్‌ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు త్రిదండి దేవనాథ జీయర్‌ స్వామి హాజరై రథానికి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంపై అలివేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి గోవింద నామస్మరణ చేస్తూ భక్తులు తాళ్లతో రథాన్ని లాగారు. మహిళలు రథం ముందు పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ ముందుకు సాగారు. అనంతరం దేవనాథ జీయర్‌ స్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. భగవన్నామస్మరణతో మనసుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. రాత్రి కి క్షీరచంద్ర దర్శనము, రథోత్సవము, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బెటాలియన్‌ అధికారులు, సిబ్బందితోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లాస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్‌ పోటీలు


విజయం సాధించిన వర్ని బాలుర జట్టు


కల్దుర్కి బాలికల జట్టు

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలోని గీతాకాన్వెంట్‌ పాఠశాల గ్రౌండ్‌లో 43వ జూనియర్‌ జిల్లా స్థాయి బాలబాలికల ఖోఖో చాంపియన్‌ షిప్‌ పోటీలను జిల్లా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి అవధూత గంగాధర్‌ చదువుతోపాటు ఆటల ప్రాముఖ్యతను వివరించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్‌ చైర్మన్‌ బిల్లా అనిల్‌, బాధ్యులు జీవీ భూమారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 24 జట్లు పాల్గొనగా బాలుర విభాగంలో వర్ని జడ్పీహెచ్‌ పాఠశాల జట్టు విన్నర్‌ కాగా, మామిడిపల్లి పాఠశాల రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో కల్దుర్కి పాఠశాల విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా కంజర్‌ పాఠశాల నిలిచింది. కార్యక్రమంలో ఆటపోటీల కన్వీనర్‌ గంగాసాగర్‌, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రాస నిత్యానందం, జిల్లా ఖోఖో అసోషియేషన్‌ అతీకుల్లా, పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్‌, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి నాగేశ్వరరావు, గోపిరెడ్డి, రాజ్‌కుమార్‌, సుజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎక్సైజ్‌ అధికారుల చేతివాటం?

ఖలీల్‌వాడి: జిల్లాలోని వేల్పూర్‌ మండలం మోతె గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్‌ షాపుపై గురువారం రాత్రి దాడిచేసిన ఎక్సైజ్‌ అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించినట్లు తెలిసింది. బెల్ట్‌ షాపు నిర్వాహకుడు తమ పరిధిలో మద్యం తీసుకోకుండా వేరే ప్రాంతంలోని వైన్‌ షాపు నుంచి రూ.లక్ష విలువైన మద్యం తీసుకువచ్చినట్లు తెలిసి స్థానిక వైన్స్‌ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా అధికారులు దాడి చేసినట్లు సమాచారం. రూ.లక్ష విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌ అధికారులు సుమోలో తరలిస్తుండగానే, మరో వైన్‌షాపు నిర్వాహకుల నుంచి ఫోన్‌ రావడంతో తిరిగి యథాస్థానానికి ప్రైవేట్‌ డ్రైవర్‌ శివ ద్వారా చేర్చినట్లు సమాచారం. సదరు ఎక్సైజ్‌ అధికారి ఆర్మూర్‌ లోని తన రూమ్‌ ను అడ్డాగా చేసుకొని బెల్ట్‌ షాపు నిర్వాహకుల నుంచి ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై మోర్తాడ్‌ ఎక్సైజ్‌ ఎస్సై గుండప్పను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌ కలవలేదు.

ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్‌/నందిపేట్‌: హిందువులను అవమానపరుస్తూ మతకల్లోలాలకు కారణమవుతున్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్మూర్‌, నందిపేట్‌ పోలీస్‌ స్టేషన్‌లలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతకల్లోలాలు చెలరేగేలా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, తన బాధ్యతను మరిచి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. భవిష్యత్‌లో లా అండ్‌ ఆర్డర్‌ అదుపుతప్పే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్‌ నాయకులు పూజ నరేందర్‌, గంగారాం, పృథ్వీరాజ్‌, అగ్గుక్రాంతి, నందిపేటలో పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్‌, కోమన్‌పల్లి రాజన్న, బాలగంగాధర్‌, సురేందర్‌, ప్రవీణ్‌, రవి, రాజేశ్వర్‌, రాజేందర్‌ తదితరులున్నారు.



ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ఖలీల్‌వాడి: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరి అని, ఎక్కు శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయెుద్దని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్‌పై పూర్తిగా నిషేధం ఉందని పేర్కొన్నారు. 500 మందితో సమావేశాలు లేదా సభలు నిర్వహించాలనుకునే వారు అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్‌ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, 500 మంది కంటే ఎక్కువ జనాలు వచ్చే కార్యక్రమమైతే 72 గంటల ముందుగా సీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. మాల్స్‌, సినిమా థియేటర్లు, హోటళ్లు, ఎగ్జిబిషన్‌, వ్యాపార ప్రదేశాల్లో ప్రజల సెక్యూరిటీకి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రోన్‌ల వాడకానికి అనుమతి తీసుకోవాలన్నారు. గల్ఫ్‌ ఏజెంట్లకు ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను 16 నుంచి 31వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

21 నుంచి పోలీసు సంస్మరణ వారోత్సవాలు



ఖలీల్‌వాడి: ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించనున్న ట్లు సీపీ కల్మేశ్వర్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు నిర్వహించనున్న సంస్మ రణ వారోత్సవాల్లో భాగంగా కమిషనరేట్‌ పరిధిలోని నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ డివిజన్‌లలోని అన్ని పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో క్యాండిల్‌, ద్విచక్ర వాహనాల ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ, షార్ట్‌ ఫిలిం పోటీలు, రక్తదాన శిబిరం, జాతీయ ఐక్యత దినోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ క్రీడాకారుల ఎంపిక



ఆర్మూర్‌: పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల బాలుర క్రీడా మైదానంలో గురువారం జిల్లా సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌ బాల్‌ క్రీడాకారులను ఎంపిక చేశారు. మొత్తం 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల చివరి వారంలో గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్ర సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌ బాల్‌ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ సాయన్న, ఉపాధ్యాయులు గంగాధర్‌, అకాడమీ కోచ్‌ నరేశ్‌, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్‌, సంతోష్‌, రాజేందర్‌ పాల్గొన్నారు.

ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ విరమణ

తెయూ(డిచ్‌పల్లి): మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ చేపట్టిన ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్‌ను విరమించినట్లు తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్‌ కాలేజ్‌ మేనేజ్‌మెంట్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు అంబోజి హరిప్రసాద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ బుర్రా వెంకటేశం ఇచ్చిన హామీ మేరకు బంద్‌ విరమిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జారీ చేసిన టోకెన్స్‌ మొత్తాన్ని వారం రోజుల్లో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో ప్రైవేట్‌ కాలేజ్‌ మెనేజ్‌మెంట్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర నాయకత్వం జరిపిన చర్చల్లో ప్రిన్సిపల్‌ సెక్రెటరీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి డిగ్రీ, పీజీ కళాశాలలను పునఃప్రారంభిస్తామని తెలిపారు.

రేపు ఎస్‌జీఎఫ్‌ ఉషూ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–17 బాలబాలికలకు ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్‌) ఉషూ ఎంపికలను ఈ నెల 19న పాత కలెక్టరేట్‌ మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రటకనలో తెలిపారు. క్రీడాకారులు బోనాఫైడ్‌ వెంట తీసుకురావాలని సూచించారు.

వాలీబాల్‌ ఎంపికలు

ఎస్‌జీఎఫ్‌ అండర్‌–17 బాలబాలికల విభాగంలో ఈ నెల 19న వాలీబాల్‌ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10గంటలకు బోనాఫైడ్‌ వెంట తీసుకుని హాజరుకావాలన్నారు.

కమిషనరేట్‌లో వాల్మీకి జయంతి

ఖలీల్‌వాడి: మహర్షి వాల్మీకి జయంతిని సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి, శంకర్‌ నాయక్‌ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆఫీస్‌ సూపరింటెండెంట్‌లు శంకర్‌, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, పోలీసు కార్యాలయ సిబ్బంది, సీసీఆర్‌బీ సిబ్బంది, సీఎస్‌బీ సిబ్బంది, ఐటీ కోర్‌ సిబ్బంది, పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

'సాయి ఆయుష్‌'లో శిశువు మృతి



నిజామాబాద్‌ నాగారం: నగరంలోని సాయి ఆయుష్‌ చిన్న పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రెంజల్‌ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గంగామణికి ఏడో నెలలో బాబు జన్మించాడు. బరువు తక్కువగా ఉండడంతోనే శిశువును చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన తండ్రి నరేశ్‌గౌడ్‌ సాయి ఆయుష్‌ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్సకు రూ.3 లక్షల ప్యాకేజీ మాట్లాడారు. 20 రోజులకుపైగా చికిత్స పొందిన శిశువు గురువారం మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలపడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, తాడ్‌బిలోలి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే రూ.లక్ష చెల్లించామని తెలిపారు. వైద్యుడు వారికి సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. వైద్యం సరిగా చేయక పోవడంతోనే శిశువు మృతి చెందాడని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీస్‌ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సీతారాంనగర్‌ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీతారాంనగర్‌ కాలనీకి చెందిన వ్యక్తి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. బుధవారం రాత్రి దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలోని రూ.25వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజీలో ముగ్గురు దుండగుల కదలికలను గుర్తించామని ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ధర్పల్లి: మండల కేంద్రం శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. హస్గుల్‌ గ్రామానికి చెందిన పలువురు వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం ఉదయం దాడి చేశారు. పెద్దకొడప్‌గల్‌ జాతీయ రహదారి మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్‌ తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్లను తహసీల్‌ కార్యాలయంలో అప్పగించామన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం సేవించి వస్తున్నందుకు భార్య మందలించిందని ఒకరు, భార్య విడాకులు ఇచ్చిందని మరొకరు బలవన్మరణానికి పాల్పడగా, ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

భార్య మందలించిందని..

మోర్తాడ్‌(బాల్కొండ): రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇబ్బంది పెడుతున్న భర్తను భార్య మందలించడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం భీమ్‌గల్‌ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన దడివె రాజేందర్‌(59) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించడం మానుకోవాలని భార్య శోభ మందలించడంతో మనస్తాపానికి గురైన రాజేందర్‌ అడ్డగుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు.

భార్య విడాకులిచ్చిందని..

మోపాల్‌: జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన గడ్డం రమేశ్‌(45) మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మొదటిభార్య చనిపోవడంతో రమేశ్‌ నర్సింగ్‌పల్లికి చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తెను నర్సింగ్‌పల్లికి చెందిన యువకుడికి ఇచ్చి పెళ్లి చేశాడు. రెండో భార్య విడాకులు తీసుకోవడంతో రమేశ్‌ మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరిన ఆయన నర్సింగ్‌పల్లి గ్రామ శివార్లలో రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు.

క్యాసంపల్లికి చెందిన వృద్ధురాలు..


బాల్‌రాజవ్వ మృతదేహం

కామారెడ్డి క్రైం: మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజవ్వ (95)కు వయస్సు పైబడడంతోపాటు కొంత మతిస్థిమితం కోల్పోయింది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి ఆమె బయటికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. 12 గంటల సమయంలో సమీపంలోని చెరువులో బాల్‌రాజవ్వ శవమై తేలింది. మృతురాలి కుమారుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

బైక్‌ అదుపుతప్పి..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని హాసాకొత్తూర్‌ రోడ్‌లో బుధవారం అర్ధరాత్రి బైక్‌ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై నరేందర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌కు చెందిన దిబ్బ అనిల్‌(20), కనుగుర్తి శివరాజు కలిసి బుధవారం రాత్రి బైక్‌పై బషీరాబాద్‌కు వెళ్లారు. తిరిగి తాళ్ల రాంపూర్‌కు వెళ్తుండగా, వేగంగా ఉన్న బైక్‌ కమ్మర్‌పల్లి శివారులోని ఓ ప్రైవేట్‌ పాఠశాల మూల మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్‌ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన శివరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని కందర్‌పల్లి వద్ద నేషనల్‌ హైవేపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. హంగర్గా గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ గొండ బిచ్కుంద సంతకు వచ్చి కాలినడకన వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తూనికలు, కొలతలశాఖ ఉద్యోగి..


సుమన్‌ (ఫైల్‌)

మాక్లూర్‌: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో పెర్కిట్‌కు చెందిన సుమన్‌(37) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్‌లో తూనికలు కొలతలశాఖలో పని చేసే ఆర్మూర్‌ పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన సుమన్‌ గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు రాంచంద్రాపల్లి శివారులో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సుమన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..


శ్రీను మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): చేపలను వేటాడేందుకు వేసిన వల ప్రమాదవశాత్తు కాళ్లకు చుట్టుకోవడంతో మండల కేంద్రానికి చెందిన వడ్డె శ్రీను (60)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయలు తెలిపారు. శ్రీను, గాంధారికి చెందిన మరో వ్యక్తి కాటికాపల లక్ష్మణ్‌తో కలిసి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని నేరల్‌ గ్రామ శివారులో ఉన్న కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడుతున్న క్రమంలో వల చుట్టుకొని శ్రీను మృతి చెందాడు. మృతుడి భార్య సాలవ్వ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ఆయిల్‌ చోరీ

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో దుండగులు బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. బట్టు భూమేశ్‌కు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న 51/100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. లైన్‌ ఇన్స్‌స్పెక్టర్‌ ఆలూర్‌ గంగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాటుసారా పట్టివేత



సిరికొండ : మండలంలోని చీమన్‌పల్లి, పందిమడుగు, ధూప్యాతండా, మైపాల్‌ తండా, జనియాల తండాల్లో దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటు సారాను పట్టుకున్నట్లు భీమ్‌గల్‌ ఎక్సైజ్‌ సీఐ వేణు మాధవరావు గురువారం తెలిపారు. నాటుసారా అమ్ముతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. పాకాలకు చెందిన సభావత్‌ శ్రీనివాస్‌ తన ద్విచక్ర వాహనంపై పది లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో అడిషనల్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నాయక్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న, డీటీఎఫ్‌ సీఐ విలాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.